క్లుప్తంగా

రోడ్డు ప్రమాద ఘటనలో ఒకరిపై కేసు నమోదు

తోటపల్లిగూడూరు : మండలంలోని చింతోపు సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాద ఘటనకు సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జంపానికుమార్ వెల్లడించారు. ఆయన బుధవారం వెల్లడించిన వివరాల మేరకు.. ఈనెల 16వ తేదీ రాత్రి చింతోపు గ్రామానికి చెందిన నెట్రంబాకు గోపి, పూరి మహేంద్ర మోటారు బైక్‌పై నరుకూరు నుంచి చింతోపు వెళ్తున్నారు. ఇదే సమయంలో చింతోపునకు చెందిన లేబూరు బాలాజీ కారులో సౌత్‌ఆములూరు నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో చింతోపు వద్ద కారు, మోటారు బైక్ బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న గోపి, మహేంద్ర గాయపడ్డారు. కాగా లేబూరు బాలాజీ తమను ఉద్దేశ పూర్వకంగానే కారుతో ఢీకొట్టి చంపబోయాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై జంపానికుమార్ ఘటనా స్థలంలో విచారణ జరిపారు. లేబూరు బాలాజీపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో ఓ వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో బుధవారం జరిగింది. నెల్లూరు నగరానికి చెందిన వెంకట్రావ్ పనినిమిత్తం బైక్‌పై కసుమూరుకు వెళ్లాడు. తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా కసుమూరు మలుపురోడ్డు వద్ద ఆటో అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో వెంకట్రావ్‌కు గాయాలవడంతో చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొట్లపాళెంలో విద్యుత్ మోటార్ల చోరీ

వెంకటాచలం: మండలంలోని తిక్కవరప్పాడు పంచాయతీ గొట్లపాళెం పొలాల్లో రెండు విద్యుత్ మోటార్లను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గొట్లపాళెం గ్రామానికి చెందిన నలగర్ల రంగయ్య, రాజయ్య తమ పొలాల్లో రెండో పంట సాగు కోసం విద్యుత్ మోటార్లతో సాగునీటిని తరలిస్తున్నారు. ఎప్పటిలానే రైతులు బుధవారం ఉదయం పంట పొలాల్లోకి వెళ్లగా, రెండు మోటార్లు చోరీకి గురైనట్లు గుర్తించి వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక్కో మోటారు విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని రైతులు వాపోయారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫీజులు తగ్గించాలని వినతి



ఎంఈఓ దిలీప్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నేతలు

బుచ్చిరెడ్డిపాళెం: ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో అధిక ఫీజులు తగ్గించాలని ఎస్‌ఎఫ్‌ఐ నేతలు ఎంఈఓ దిలీప్‌కు ఆయన కార్యాలయంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కోవూరు మహేష్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ఆట స్థలాలు, లైబ్రేరీలు లేవని, అర్హత లేనివారితో విద్యాబోధన చేయిస్తున్నారని తెలిపారు. వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రవి, సాయి, సురేష్, పెంచలయ్య, షారుఖ్ పాల్గొన్నారు.

న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ నేడు

నెల్లూరు (లీగల్): కృష్ణా జిల్లా మొవ్వ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రావుపై దాడికి నిరసనగా కోర్టు విధులను న్యాయవాదులు గురువారం బహిష్కరించనున్నారని నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి అన్వర్‌బాషా, ట్రెజరర్ రమేష్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో అత్యవసర కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. న్యాయవాదిపై దుండగుల దాడిని ఖండిస్తూ కోర్టు విధులను బహిష్కరించాలని నిర్ణయించారు.

సినిమాలకు హబ్‌గా సింహపురి



షూటింగ్‌ను ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

నెల్లూరు(బృందావనం): సినిమాలకు హబ్‌గా నెల్లూరు మారుతోందని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. లింబో చిత్ర స్క్రిప్టునకు పూజా కార్యక్రమాన్ని రాయాజీవీధిలోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో బుధవారం నిర్వహించారు. అనంతరం క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు.

గ్రామాలకు రాచబాట

- పల్లె ప్రాంతాల రోడ్లకు మహర్దశ
- రూ.కోట్లలో నిధుల మంజూరు
- వేగవంతంగా నిర్మాణ పనులు
- మూడు నెలల్లో పనులు పూర్తయ్యే అవకాశం



పనులు జరుగుతున్న బిరదవోలు గ్రామీణ రహదారి

పొదలకూరు : మండల పరిధిలోని గ్రామాలకు రాచబాట ఏర్పడనుంది. సుదీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోని రోడ్లకు ప్రస్తుత ప్రభుత్వంలో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవ తీసుకుని రూ.కోట్లాది నిధులను రహదారుల నిర్మాణానికి మంజూరు చేయించారు. ఫలితంగా గ్రామీణ రోడ్ల నిర్మాణం జరుగుతుండగా పొదలకూరు నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారులకు నిధులు మంజూరయ్యాయి. వీటికి సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయితే పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు వెల్లడించారు. గత ప్రభుత్వాలు గ్రామీణ రహదారులను గాలికి వదిలేస్తే ఈ ప్రభుత్వంలో పార్లపల్లి, నల్లపాళెం, ఇనుకుర్తి, పొడమేకల కండ్రిగ తదితర గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసింది. ఈ రోడ్లను కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు.

మొగళ్లూరు, బిరదవోలు రోడ్లకు రూ.3.73 కోట్లు

మండలంలోని మొగళ్లూరు, బిరదవోలు గ్రామీణ రహదారులకు మొత్తం రూ.3.73 కోట్లు మంజూరు అయ్యాయి. బిరదవోలు రోడ్డు పనులు 50 శాతం పూర్తి కాగా మొగళ్లూరు రోడ్డు పనులను ప్రారంభించి జంగిల్ క్లియరెన్స్ పూర్తి చేశారు. పొదలకూరు–నెల్లూరు మార్గం చాటగొట్లకు సమీపంలో బిరదవోలు రోడ్డు 3.1 కి.మీ దూరంతో పనులు జరుగుతున్నాయి. ఈ రహదారి పూర్తయితే మనుబోలు, సైదాపురం మండలాల గ్రామాలకు సైతం ఎంతగానో ఉపయోగపడుతుంది. పొదలకూరు పట్టణం మీదుగా కాకుండా దగ్గరగా నెల్లూరు నగరానికి వెళ్లేందుకు వీలుకలుగుతుంది. బిరదవోలు, చెర్లోపల్లి, కల్యాణపురం, పార్లపల్లి, బ్రాహ్మణపల్లి, గొట్లపాళెం, వీరంపల్లి, కట్టుముడిపల్లి తదితర గ్రామస్తులు రహదారి మీదుగా వెళ్లేందుకు అవకాశం కలుగుతుంది. మొగళ్లూరు రోడ్డును 1.6 కి.మీ నిడివితో నిర్మిస్తున్నారు. అధ్వానంగా ఉన్న ఈ రహదారి పూర్తయితే ఊసపల్లి, అంకుపల్లి, పులికల్లు, వావింటపర్తి, పర్వతాపురం, వెంకటాపురం గ్రామస్తులకు మేలు కలుగుతుంది. సుఖవంతమైన ప్రయాణం చేసేందుకు అవకాశం ఏర్పడుతుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పొదలకూరు పట్టణంలో పాత సిమెంటురోడ్డు



మొగళ్లూరు రోడ్డుపై జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్ పనులు(ఫైల్)

ఆర్‌అండ్‌బీ రహదారులకు రూ.13.50 కోట్లు

పొదలకూరు–సోమశిల, పొదలకూరు–సంగం, పొదలకూరు–మనుబోలు మార్గంలో ఆర్‌అండ్‌బీ రోడ్ల నిర్మాణానికి మంత్రి కాకాణి చొరవతో రూ.13.50 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. వీటితో రహదారుల ఆధునికీకరణ పనులు పూర్తి చేస్తే ప్రయాణికుల ఇబ్బందులు తొలగిపోతాయి. ఇందుకోసం ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసే పనిలో ఉన్నారు. మండలంలోని నావూరు రోడ్డు మీదుగా అయ్యగారిపాళెం, నందివాయ, అమ్మవారిపాళెం, నావూరుపల్లి, నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం గ్రామాలు ఉన్నాయి. ఈ రహదారి బాగా దెబ్బతిని ఉండడంతో నావూరు రోడ్డు ఆధునికీకరణ పనులకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. త్వరలో రోడ్డు పనులను పూర్తి చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. పొదలకూరు పట్టణంలో రూ.5 కోట్లతో ఆర్‌అండ్‌బీ మెయిన్‌రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శ్రీకారం చుట్టారు. సంగం రోడ్డు సెంటరు నుంచి గేటుసెంటరు వరకు సిమెంటురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తున్నారు. త్వరలో ఇందుకు సంబంధించిన నిధులు విడుదలయ్యే అవకాశం ఉంది.

ఇకపై బాధలు ఉండవు



ఇకపై తమకు రహదారి బాధలు ఉండవు. మొగళ్లూరు రోడ్డు బాగా దెబ్బతినడంతో మంత్రి కాకాణి మార్కెటింగ్‌శాఖ నిధులతో శాశ్వత ప్రాతిపదికన సిమెంటు రోడ్డు నిర్మాణం చేయిస్తున్నారు. ఇంతకాలం పడిన వెతలు త్వరలో తొలగిపోనున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అంతా మేలు జరుగుతోంది.

– ఆకుల లక్ష్మి, సర్పంచ్, మొగళ్లూరు

మూడు మండలాలకు ఉపయోగం



బిరదవోలు రోడ్డు నిర్మాణం వల్ల మూడు మండలాలకు ఉపయోగం ఉంది. పొదలకూరుతో పాటు మనుబోలు, సైదాపురం మండలాల గ్రామస్తులు సైతం ఈ రోడ్డుపై సాఫీ ప్రయాణం సాగించేందుకు అవకాశం ఏర్పడింది. రోడ్డుపక్కన ఉన్న పొలాలకు విలువ కూడా పెరుగుతుంది.

– వి.దయాకర్‌రెడ్డి, కల్యాణపురం

త్వరితగతిన పనులు

బిరదవోలు, మొగళ్లూరు గ్రామీణ రహదారుల పనులు వీలైనంత త్వరితగతిన పూర్తి చేస్తాం. మార్కెటింగ్‌శాఖ నిధుల ద్వారా రెండు రోడ్లను రూ.3.73 కోట్లతో పూర్తి చేస్తాం.

– మవేక్‌రెడ్డి, పీఆర్ ప్రాజెక్ట్ ఏఈ

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు



చిన్నారులకు ఫిక్స్‌డ్ డిపాజిట్ల బాండ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని రావూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌ను అందించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోని అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నట్లు తెలిపారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇప్పటివరకు 75 సచివాలయాల పరిధిలో 86,904 గడపలు తిరిగినట్లు పేర్కొన్నారు. తొలుత స్థానిక నేతలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ కె.నాగేంద్రబాబు, సీఐ కె.రామకృష్ణారెడ్డి, పార్టీ నేతలు దేవిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కొండ్లపూడి శ్రీనివాసులురెడ్డి, గూడూరు ప్రభాకర్‌రెడ్డి, షబ్బీర్, ముంగర కొండలరావు, ప్రభాకర్, ఉడతా రామకృష్ణ, బాలబొమ్మ శ్రీనివాసులు, వెంకట కృష్ణయ్య, సత్యం, ముంగర నాగజ్యోతి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రసన్న ఆపన్నహస్తం

కొమరిక గ్రామంలో పేదరికంతో ఇబ్బందులు పడుతున్న నలుగురు చిన్నారులకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి ఆపన్నహస్తం అందించారు. వీరిలో తంజావూరు హరి అనారోగ్యంతో ఉండడంతో వారి ఇద్దరు పిల్లలకు, అదే గ్రామానికి చెందిన కావలి అశోక్ మృతిచెందడంతో అతని ఇద్దరు పిల్లలకు వారి పేరుమీద రూ.20 వేల చొప్పున బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. ఈ బాండ్లను ఆయా చిన్నారులకు అందించారు. రావూరు గ్రామానికి చెందిన బాలబొమ్మ అమరావతికి రూ.10 వేలను ఎమ్మెల్యే ప్రసన్న విరాళంగా అందజేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసరాలను అందజేస్తున్న వైద్యాధికారి రామకృష్ణ

కొడవలూరు : పీహెచ్‌సీలో చికిత్స పొంది క్షయ నుంచి కోలుకున్న బాధితులకు కొడవలూరు పీహెచ్‌సీలో బుధవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. వీటిని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షయ సమస్య ఉన్న వారు పీహెచ్‌సీలో సంప్రదిస్తే పైసా ఖర్చు లేకుండా వ్యాధిని నయం చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న వారికి పోషక విలువలున్న నిత్యావసరాలను ఉచితంగా అందజేస్తామన్నారు. ఎవరికైనా క్షయ అనుమానిత లక్షణాలుంటే వెంటనే పీహెచ్‌సీలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ టి.సోమశేఖర్, ల్యాబ్ టెక్నీషియన్ మేరి జర్సీ, స్టాఫ్ నర్సులు వెన్నెల, అనిత, ఏఎన్‌ఎం శేషుబాయి, హెచ్‌ఎస్ వి.రామ్మోహన్, హెచ్‌ఏ షఫీఉద్దీన్, క్షయ పర్యవేక్షకుడు సత్యనారాయణ, సిబ్బంది సుజాత, మేరి జాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఎన్‌ఎస్సార్ ట్రస్ట్ చేయూత



బాధిత కుటుంబాలకు నగదును అందజేస్తున్న పార్టీ నేతలు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ, పల్లాప్రోలు గ్రామంలో డయేరియాతో మృతి చెందిన వారి కుటుంబాలకు ఎన్‌ఎస్సార్ ట్రస్ట్ ద్వారా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేయూత అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నేత కోడూరు మధుసూదన్‌రెడ్డి, కావలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎస్సీ కాలనీకి చెందిన పోతురాజు లీలమ్మ, దాసరి వెంకయ్య ఇటీవల డయేరియాతో మృతిచెందగా వారి కుటుంబాలకు ఎమ్మెల్యే ప్రసన్న అండగా ఉంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇరువురు కుటుంబాలకు నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.50 వేల చొప్పున, అలాగే డయేరియా నుంచి కోలుకున్న ధనమ్మ, అక్కయ్యలకు రూ.10 వేల చొప్పున అందించారని, ఈ మొత్తాన్ని బాధిత కుటుంబాలకు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నేత కల్లూరు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తాటిపర్తికి మంత్రి కాకాణి రాక

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం ఉదయం 10.30 గంటలకు మండలంలోని తాటిపర్తి సచివాలయంలో జరిగే జగనన్న సురక్ష క్యాంపులో పాల్గొంటారని పంచాయతీ ఉపసర్పంచ్ పాముూరు లచ్చారెడ్డి బుధవారం తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్మాణం పూర్తి చేసుకున్న విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

పదెకరాల గడ్డివామి దగ్ధం



కోవూరు(విడవలూరు) : మండలంలోని అలగానిపాడు దళితవాడలో ప్రమాదవశాత్తు పది ఎకరాల గడ్డివామి బుధవారం దగ్ధమైంది. గ్రామంలో నివాసముంటున్న పరసు రమణయ్య అనే రైతుకు చెందిన పది ఎకరాల గడ్డిని ఇంటికి దగ్గర్లో వామి వేసుకున్నారు. బుధవారం సాయంత్రం ప్రమాదవశాత్తు గడ్డికి నిప్పంటుకుంది. వెంటనే కావలి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అయితే వారు వచ్చేలాగా గడ్డివామి పూర్తిగా దగ్ధమైంది. వీటి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని రైతు వాపోయాడు.

పకడ్బందీగా 'జగనన్న సురక్ష'



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మలోల

- నెల్లూరు ఆర్డీఓ మలోల

పొదలకూరు : జగనన్న సురక్ష క్యాంపును పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని నెల్లూరు ఆర్డీఓ ఎ.మలోల ఆదేశించారు. మండలంలోని నల్లపాళెం(తాటిపర్తి–2 సచివాలయం) సచివాలయాన్ని ఆర్డీఓ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 22న జగనన్న సురక్ష క్యాంపును సచివాలయంలో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సర్టిఫికెట్లను అందజేయాల్సిందిగా సూచించారు. అనంతరం నల్లపాళెం గ్రామంలో నిర్వహిస్తున్న భూముల రీ–సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ సర్వే పూర్తయ్యిందని, గ్రౌండ్ ట్రూతినింగ్ జరుగుతున్నట్లు పేర్కొన్నారు. రైతులను దగ్గర పెట్టుకుని పొలాల గట్లు, హద్దులను నిర్ణయిస్తామన్నారు. రీ–సర్వేలో ఎక్కడా పొరపాట్లు జరగకుండా పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్నట్లు వెల్లడించారు. పొరపాట్లు జరిగితే రైతులు అప్పీలు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. తరువాత నల్లపాళెం నుంచి విరువూరు గ్రామానికి చేరుకున్న ఆర్డీఓ అక్కడి రైతులు నెల్లూరు తాగునీటి అవసరాలకై నిర్మించిన పైపులైను కోసం అందించిన పొలాలకు అవార్డు ప్రకటించేందుకు రైతులతో మాట్లాడారు. త్వరలో రైతులకు పరిహారం అందజేస్తామని పేర్కొన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ కె.వీరవసంతరావు, మండల సర్వేయర్ ఎల్.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఈపూరులో ఉపాధి పనులు



కాలువలో పూడిక తీస్తున్న మహిళలు

ముత్తుకూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో భాగంగా ఈపూరు గ్రామ పేదలకు పనులు కల్పించారు. ఇందులో భాగంగా పోర్టు బైపాస్‌రోడ్డులోని సరిబేటు కాలువ పూడిక తీసే పనులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్ రఘు మాట్లాడుతూ, రూ.89,000ల అంచనాలతో 1.5 కిలోమీటర్ల మేరకు కాలువ పూడికతీసే పనులు చేపట్టామన్నారు. ఇందుకోసం 65 మంది ఈ పనిని ప్రారంభించారన్నారు. నాలుగు రోజుల పాటు పనులు జరుగుతాయని వెల్లడించారు.

పాఠశాలలకు సెమిస్టర్ పాఠ్య పుస్తకాలు



కొడవలూరు స్టాక్ పాయింట్ నుంచి పాఠ్య పుస్తకాల తరలింపు

కొడవలూరు : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు సెకండ్ సెమిస్టర్ పాఠ్య పుస్తకాలు చేరాయి. కొడవలూరులోని జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్ నుంచి బుధవారం పాఠ్యపుస్తకాలను ప్రభుత్వ వాహనాల్లో పాఠశాలలకు చేర్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ జి.వసంతకుమారి మాట్లాడుతూ మండలంలోని 80 ప్రభుత్వ పాఠశాలలకు అన్ని పాఠ్య పుస్తకాలు పరిపూర్ణంగా అందిస్తున్నట్లు తెలిపారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన ఉండాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

- ఏడీఏ మారుతీదేవి

మనుబోలు : చిరుధాన్యాల సాగుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ ఏడీఏ మారుతీదేవి సూచించారు. నెల్లూరు జలవనరుల కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని పిడూరు, చెర్లోపల్లి, జట్లకొండూరు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు బుధవారం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో విత్తనశుద్ధి, నారుమడి యాజమాన్యం, కలుపు, ఎరువుల యాజమాన్యం, చీడపీడల నివారణ, పచ్చిరొట్ట ఎరువుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు నారుమడి వేసే ముందు విత్తన శుద్ధి చేసుకుంటే పైరు దశలో వచ్చే చీడపీడలను తగ్గించుకోవచ్చన్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓలు జహీర్, శైలజ, గీతామాధురి తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి దుర్వినియోగం కాకూడదు'



సమావేశంలో మాట్లాడుతున్న కామాక్షయ్య

- ఏజీఎం కామాక్షయ్య

మనుబోలు : పొదుపు గ్రూపులకు ఇచ్చే స్త్రీనిధి నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందికి సూచించారు. మనుబోలు మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో బుధవారం వీఓఏలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా స్త్రీ నిధి ఎంత వసూలు అయిందో అంటూ ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ నిధి నిధులు దారి మళ్లితే విచారణ జరిపి సంబంధిత సీసీలు, వీఓఏలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిధుల వసూళ్లకు సంబంధించిన రసీదులు భద్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట స్త్రీ నిధి ఏపీఎం హరీష్, సీసీ జయమ్మ ఉన్నారు.

బడిఈడు పిల్లలపై ప్రత్యేక దృష్టి



ముత్తుకూరు : చిన్నారులతో మాట్లాడుతున్న ఎంఈఓ మధుసూదన, హెచ్‌ఎం తాన్య



కొడవలూరులో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ



కొడవలూరు: నార్తురాజుపాళెం సీబీఎన్ కాలనీలో పిల్లలకు ఎంఈఓ కౌన్సెలింగ్

ముత్తుకూరు : బడిఈడు పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంఈఓ మధుసూదన అన్నారు. మండలంలోని బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్ పరిధిలో బడి మానేసిన పిల్లలు, వారి తల్లిదండ్రులతో బుధవారం హెచ్‌ఎం తాన్యతో కలిసి ఆయన మాట్లాడారు. పిల్లలకు చదువుకు మించిన ఆస్తి లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రయివేటు స్కూళ్లకు దీటుగా తయారు చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోరారు. ఉపాధ్యాయలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విస్తృతంగా..

కొడవలూరు: గ్రామాల్లో బడిఈడు పిల్లలపై అధికారులు విస్తృతంగా సర్వే జరుపుతున్నారు. జీఈఎస్(గ్రాస్ ఎన్‌రోల్మెంట్ రేషియో) కార్యక్రమంలో భాగంగా ఈనెల 12, 19, 26వ తేదీల్లో అన్ని సచివాలయాల పరిధిలో మండలస్థాయి అధికారులు స్థానిక సచివాలయ సిబ్బంది సహకారంతో బడిఈడు పిల్లలను గుర్తించాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసి ఉంది. ఎంత మంది పిల్లలు బడిలో ఉన్నారు? ఎంత మంది బడి బయట ఉన్నారో స్పష్టంగా సర్వే చేయాలని, బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు మండలంలోని 16 సచివాలయాల పరిధిలో నోడల్ అధికారి, వెల్ఫేర్ సహాయకులు, మహిళా పోలీసు, వలంటీర్ సాయంతో బుధవారం విస్తృతంగా సర్వే చేశారు. బడి బయటి పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు విద్య వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. బడి బయట పిల్లలను విధిగా పాఠశాలలో నమోదు చేయించి బడికి పంపాలని వెల్ఫేర్ అసిస్టెంట్, మహిళా పోలీసు, వలంటీర్‌లను ఆదేశించారు. నార్తురాజుపాళెం నోడల్ అధికారిగా ఎంఈఓ జి.వసంతకుమారి, రామన్నపాళెం నోడల్ అధికారిగా తహసీల్దార్ ఈ.రమాదేవి, కొడవలూరు నోడల్ అధికారిగా ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.